క్లుప్తంగా

పరిహారం చెల్లించాలని ఆందోళన



ఉప్పూడి ఓఎన్జీసీ సైట్ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కాట్రేనికోన: ఉప్పూడి గ్రామంలో ఓఎన్జీసీ కార్యక్రమాలను వ్యతిరేకిస్తూ సర్పంచ్ రంబాల రమేష్ ఆధ్వర్యంలో సైట్ వద్ద ఆందోళన చేపట్టారు. గతంలో ఓఎన్జీసీ సైట్‌లో జరిగిన బ్లోట్‌తో నష్టపోయిన రైతులకు, స్థానికులకు నష్ట పరిహారం చెల్లించాలని, లీజుకు తీసుకున్న భూములకు లీజును రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఓఎన్జీసీ సైట్ రోడ్డుపై నుంచి వాహనాలు వెళ్లకుండా టెంట్‌ను వేసి స్థానికులు అడ్డుకున్నారు. తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించక పోతే పనులు చేయనివ్వమని హెచ్చరించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



భీమనపల్లిలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉప్పలగుప్తం: భీమనపల్లి పీహెచ్‌సీలో పరిధిలోని 28 మంది గర్భిణులకు వైద్యాధికారి విష్ణుప్రియ బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏడుగురిని మెరుగైన వైద్యం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి పంపించారు. ఎంపీహెచ్ఈఓ రామకృష్ణ, సిబ్బంది శోభారత్నం, సత్యవతి, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంట్రుకోనలో 'పొలం పిలుస్తోంది'



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ సత్యనారాయణ

అల్లవరం: సాగులో సాంకేతిక పరమైన సలహాలు, సూచనలు పొందడానికి పొలం బడి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని వ్యవసాయాధికారి ఎన్‌వీవీ సత్యనారాయణ అన్నారు. ఎంట్రుకోన రైతు సేవా కేంద్రంలో పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం ద్వారా ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నామని తెలిపారు. సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాసరావు, కార్యదర్శి జ్యోతి, వీఎఫ్ఏ నరసింహ, గెద్దాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళులు



కాన్షీరామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మోహన్‌బాబు తదితరులు

అమలాపురం రూరల్: మాజీ సీఎం, బీఎస్పీ అధినేత కాన్షీరామ్ వర్ధంతిని కామనగరువు మేధా గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించారు. కాన్షీరామ్ చిత్రపటానికి అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాలమూరి మోహన్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి కోలా త్రిమూర్తులు, నాయకులు కోలా వికాస్, కడిమి రాజు, మల్లాడి సత్తిబాబు, కోలా సుహాస్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



దాసును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

తాళ్లరేవు: అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దే చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు సంగాని దాసును ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పరామర్శించారు. సీతారామపురంలోని దాసు ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్, నేల కిషోర్, పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, సర్పంచ్ పెయ్యల మంగేష్, నాయకులు దొరబాబు, కొపనాతి నాగరాజు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొంతు మోహన్, విత్తనాల రామకృష్ణ, కొల్లు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



జి.వేమవరం ప్రధాన రహదారిలో ప్రయాణం.. ప్రమాదకరం



గోతులతో దర్శనమిస్తున్న తోటపేట రహదారి

పడతారు... లేస్తారు!

- ఆ దారిలో ప్రయాణం తీరు
- నరకానికి నకలుగా మారిన వైనం
- కనీస మరమ్మతులు మృగ్యం

రహదారులంటారా ఇవీ.. నడ్డివిరిచే సం'గోతులు' ఉన్నాయి.. అక్కడక్కడా రోడ్డు, అంతా గుంతలే అన్నట్టు ఉంది పరిస్థితి. అడుగు లోతు గుంతలు, అందులో వర్షాలకు చేరిన నీరు, ఇలా ఎక్కడ ఏముందో తెలియని ప్రయాణం అగమ్యగోచరంలా మారింది. కనీస మరమ్మతులు లేక ప్రయాణమంటేనే ప్రజలు హడలెత్తిపోయే రోజులు వచ్చేశాయి. కూటమి ప్రభుత్వం వచ్చి వంద రోజులు అవుతున్నా, రోడ్లను బాగుచేసిన దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. ఫలితంగా నరకాన్ని తలపిస్తున్న అధ్వాన రోడ్లపై ప్రయాణం ప్రాణ సంకటంలా మారింది.



సుంకరపాలెం వద్ద అధ్వానంగా యానాం- ద్రాక్షారామ రహదారి

తాళ్లరేవు: తాళ్లరేవు మండలంలో చాలా రహదారులు అధ్వానంగా మారాయి. ప్రధాన రహదారులు సైతం గోతులు పడి ప్రజల సహనానికి పరీక్షగా మారాయి. చాలా ప్రాంతాల్లో ప్రధాన రహదారులు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. గత ప్రభుత్వంలో రహదారులు అధ్వానంగా మారాయని, ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని అప్పట్లో నానాయాగీ చేసిన టీడీపీ, జనసేన నాయకులు కనీసం ఇప్పుడు నోరు మెదపకపోవడం శోచనీయం. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా వారు రోడ్ల అభివృద్ధిపై ఎంతమాత్రం దృష్టి సారించడం లేదు. మండల కేంద్రాలకు వెళ్లే ప్రధాన రహదారులు సైతం ప్రమాదకరంగా మారాయి. తాళ్లరేవు మండల పరిధిలోని యానాం-ద్రాక్షారామ రహదారిలో నిత్యం వేలాది మంది ప్రయాణిస్తుంటారు. ఇది కీలకమైన రహదారి. ఈ రోడ్డు పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. భారీ గోతులతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ ప్రాంతంలో అనేక పాఠశాలలు, కళాశాలలు ఉండడంతో నిత్యం సైకిళ్లపై విద్యార్థులు వస్తుంటారు. వారు ఆ గోతుల్లో పడి ప్రమాదాల బారిన పడుతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అదే విధంగా ఈ ప్రాంతంలో అనేక వ్యాపార దుకాణాలు రహదారి చెంతనే ఉన్నాయి. రహదారి అధ్వానంగా ఉండడంతో రోడ్డుపై నీరు నిలిచిపోయి వాహనాలు వెళ్లినప్పుడు రహదారిపై బురద తమ దుకాణాలపై పడుతుందని, అందువల్ల వ్యాపారాలు సాగడం లేదని పలువురు వాపోతున్నారు. డ్రైనేజీ సౌకర్యం సైతం లేకపోవడంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయి నిత్యం అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఉండగా యానాం- ద్రాక్షారామ రహదారి దుస్థితిపై పలుమార్లు స్థానికులు, వ్యాపారులు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ఆదేశాలతో రూ.లక్షలు వెచ్చించి మరమ్మతులు చేపట్టారు. అయితే కొద్దిరోజులకే వర్షాలకు రహదారి కొట్టుకుపోయి పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. రహదారి మరమ్మతులకు ఖర్చు చేసిన నిధులు నీళ్లపాలు అయ్యాయని, నాణ్యతా ప్రమాణాలు లోపించడంతో పరిస్థితి మొదటికి వచ్చిందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లను బాగు చేయించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వెళ్లాలంటేనే భయమేస్తోంది



సుంకరపాలెం ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. అటుగా ప్రయాణం నరకప్రాయమైంది. పెద్ద గోతులు పడ్డాయి. రహదారి చెంతన అనేక దుకాణాలు, గృహాలు ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిలో రోజూ అనేక మంది ద్విచక్ర వాహనాలపై వెళ్తుంటారు. నిత్యం ఏదోక ప్రమాదం జరిగి గాయాలపాలవుతున్నారు. తక్షణమే అధికార యంత్రాంగం స్పందించాలి.

– వడ్డి ఏడుకొండలు, సుంకరపాలెం పంచాయతీ

రహదారిని అభివృద్ధి చేయాలి



జాతీయ రహదారి 216 నుంచి జి.వేమవరం వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. సుమారు కిలోమీటరు పైగా ఉన్న ఈ రహదారిలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. నిత్యం అనేక మంది ద్విచక్ర వాహనాలతోపాటు ఇతర వాహనాలలో ప్రయాణిస్తూ ఉంటారు. అదేవిధంగా ఆటోలు, ఆర్టీసీ బస్సుల్లో వెళుతుంటారు. గోతులు ఉండడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రహదారిని పట్టించుకునే వారు మాత్రం కరవయ్యారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు రహదారిని అభివృద్ధి చేయించాలి.

– శ్రీపాదం శ్రీనివాస్, జి.వేమవరం

విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి

యానాం: తీర ప్రాంత గ్రామాల్లో ప్రజలు విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆర్ఏఓ మునిస్వామి అన్నారు. విద్యలో ప్రతిభ కనబర్చిన మత్స్యకార విద్యార్థులకు మత్స్యశాఖ మంజూరు చేసిన నగదు బహుమతిని బుధవారం ఆయన అందజేశారు. 10, 12 తరగతుల్లో 60 శాతం, 70 శాతానికి పైగా మార్కులు సాధించిన 218 మంది విద్యార్థులకు రూ.18.27 లక్షలను విడుదల చేశారు. ఈ మొత్తం ఆయా విద్యార్థిని, విద్యార్థుల బ్యాంక్ అకౌంట్లలో జమ అవుతాయన్నారు. మత్స్యశాఖ అధికారి గొంతియ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్

యానాం: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు గ్రూప్–సి గెజిటెడ్ ఉద్యోగాల్లో ఐదు శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ దీనికి సంబంధించి నియమ నిబంధనలను విడుదల చేసిందని బుధవారం స్పోర్ట్స్ అండ్ యూత్ వెల్ఫేర్ కార్యదర్శి ఎ.అమరనాథ్ తల్వాడే తెలిపారు. ఈ మేరకు సెప్టెంబర్ 23న సంబంధిత జీఓ విడుదలైందన్నారు. బెస్ట్ స్పోర్ట్స్ పర్సన్స్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన మొత్తం 65 క్రీడా విభాగాలకు అమలు జరుగుతుందన్నారు. పుదుచ్చేరిలోని నాలుగు రీజియన్ల అభ్యర్థులు క్రీడా వసతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే కారైకల్, మాహేల్లో క్రీడా వసతులు మెరుగు పరిచామని, అదేవిధంగా యానాంలో స్టేడియాన్ని సైతం ఆధునీకరిస్తామన్నారు.

పోలీస్ శాఖలో బదిలీలు

యానాం: పోలీస్ శాఖలో పలువురు ఎస్సైలు, ఏఎస్సైలను బదిలీలు చేస్తూ బుధవారం పుదుచ్చేరి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (హెడ్ క్వార్టర్స్) సుభం ఘోష్ ఆదేశాలు జారీ చేశారు. కేవీ రమణమూర్తిని యానాం కోస్టల్ పోలీస్ స్టేషన్‌కు, డి.పట్టాభి రామయ్యను పీసీఆర్ సెల్ నుంచి కోస్టల్ స్టేషన్‌కు, కె.సుబ్రహ్మణ్యంకు దరియాలతిప్ప అవుట్‌పోస్టుకు, చింతా దీపికను పీఏపీ విభాగానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్



పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

యానాం: యానాం నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. స్థానిక టైడల్ లాకు సమీపంలో కురసాంపేటకు చెందిన వ్యక్తులు అనుమతులు లేకుండా ఇసుక ర్యాంప్ నడుపుతున్నారు. రాత్రి వేళల్లో ఇసుకను తీసుకువచ్చి అక్కడ నుంచి రవాణా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎస్సై మురుగానందన్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశారు. గౌతమీ గోదావరి పాయ వెంబడి ఇసుక తవ్వకాలకు నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) నిషేధించింది. ఈ నేపథ్యంలో ఏపీ సరిహద్దుల్లో సైతం పలుచోట్ల ఇసుక తవ్వకాలను నిలిపివేశారు. అయినప్పటికీ యానాం టైడల్ లాకు నుంచి నిత్యం ట్రాక్టర్ల ద్వారా పలు ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు.

జక్కంపూడికి ఘన నివాళి



జక్కంపూడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, వైఎస్సార్ సీపీ శ్రేణులు

అమలాపురం టౌన్: అమలాపురంలో జిల్లా వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు తోరం గౌతమ్ రాజా ఆధ్వర్యంలో మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావుతో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని దివంగత జక్కంపూడి సేవలను కొనియాడారు. స్థానిక ఎన్టీఆర్ మార్గ్‌లోని జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహానికి వారు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రామ్మోహనరావు ఎమ్మెల్యేగా, మంత్రిగా చేసిన సేవలను, ఆయన ఉద్యమ స్ఫూర్తిని ఎమ్మెల్సీ గుర్తు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కుడుపూడి బాబు పాల్గొన్నారు.

హౌసింగ్ అధికారుల తీరుపై ఆగ్రహం

అమలాపురం రూరల్: గృహ నిర్మాణాల విషయంలో తమకెందుకు సమాచారం ఇవ్వడం లేదంటూ హౌసింగ్ అధికారులను వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. హౌసింగ్ ఏఈ వినాయక వర్మ మాట్లాడుతుండగా, పేరూరు ఎంపీటీసీ చొల్లంగి సుబ్బిరామ్ కలుగజేసుకుని 2018లో మంజూరైన ఇళ్ల నిర్మాణాల బిల్లుల సర్వే విషయంలో ప్రజాప్రతినిధులకు సరైన సమాచారం ఇవ్వడం లేదన్నారు. అధికారుల తీరు మారారని ఎంపీటీసీలు వాసంశెట్టి శ్రీనివాసరావు, రేవు శ్రీనుబాబు అన్నారు. ఎంపీపీ భాగ్యలక్ష్మి స్పందిస్తూ ప్రజాప్రతినిధులకు ఎందుకు సమాచారం ఇవ్వడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో గున్నేపల్లి అగ్రహారం సర్పంచ్ పెద్దిరెడ్డి రామచంద్రరావు వైఎస్సార్ సీపీ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఒకరిపై మరొకరు కేకలు వేసుకున్నారు. ఈ విధానం సరికాదని రామచంద్రరావుతో ఎంపీపీ భాగల్యక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్‌గోపాల్ అన్నారు. ఈదరపల్లిలో మంచినీటి ప్రాజెక్టు ఫిల్టర్ బెడ్లు సక్రమంగా పని చేయకపోవడంతో ప్రజలకు నీరు అందడం లేదని ఎంపీటీసీ అడపా సత్తిబాబు అన్నారు. రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు మంజూరైనా పనులు ఎందుకు మొదలు పెట్టలేదంటూ ప్రశ్నించారు. తాండపల్లిలో కుళాయిలు వేసినప్పటికీ నీరు సక్రమంగా రావడం లేదని ఎంపీటీసీ రేవు శ్రీనుబాబు మండిపడ్డారు. చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉందని కామనగరువు ఎంపీటీసీ గుత్తుల అనిత, సర్పంచ్‌లు రేలంగి దుర్గారావు, చెల్లిబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. పేరూరు ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం సరిగా అమలు కావడం లేదంటూ ఎంపీటీసీ శ్రీనివాసరావు ప్రశ్నించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు పాలమూరి బాలకృష్ణ, అడపా సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎంపీడీఓ యు.బాబ్జిరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈతో మాట్లాడుతున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి

సరస్వతీ మాతా రావమ్మా.. శుభములొసగు మాయమ్మా..



నీలపల్లిలో సరస్వతీదేవిగా అమ్మవారు



పాతకోరంగి పురాతన శివాలయంలో సరస్వతీ పూజ చేస్తున్న చిన్నారులు



సరస్వతీదేవిగా అమలాపురం శ్రీదేవి అమ్మవారు



కుండలేశ్వరంలో సరస్వతీదేవిగా అమ్మవారు

- వేడుకగా శరన్నవరాత్ర మహోత్సవాలు
- సరస్వతీ దేవిగా అమ్మవారికి అలంకరణ

తాళ్లరేవు: చదువుల తల్లికి ప్రణమిల్లారు.. సరస్వతీ మాతా రావమ్మా, శుభములొసగు మాయమ్మ అంటూ ఆ తల్లిని మనసారా పూజించారు. శరన్నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని వివిధ గ్రామాల్లో అమ్మవార్లను సరస్వతీ మాతగా అలంకరించారు. నీలపల్లి గ్రామంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కంచర్ల వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పంచమ నవచండీ సహిత శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించారు. తాళ్లరేవు ప్రధాన రహదారి చెంతన పరదేశమ్మ వీధిలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద భూసారపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చిన్నారులచే సామూహిక సరస్వతీ పూజ చేయించారు. అమ్మవారిని కలువపువ్వులు, పరీక్ష అట్టలతో అలంకరించారు. పాతకోరంగి బాలాత్రిపుర సుందరీ సమేత కురంగేశ్వరస్వామివారి ఆలయం, తాళ్లరేవు కేశవస్వామి కాలనీలోని దుర్గా ఆలయం, జార్జిపేట దుర్గామల్లేశ్వర ఆలయాల్లో సరస్వతీ పూజను నిర్వహించారు.

అమలాపురం పట్టణంలో..

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు ఆధ్వర్యంలో హోమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఆలయాన్ని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు దంపతులు దర్శించుకున్నారు. శ్రీదేవి అమ్మవారు, కన్యకా పరమేశ్వరీదేవి అమ్మవారు, వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గల వైష్ణవీ కనకదుర్గ, సావరం బైపాస్ రోడ్డులోని కనకదుర్గ, గోల్డ్ మార్కెట్ వద్ద కామాక్షీ ఏకాంబరేశ్వరీదేవి ఆలయాల్లో అమ్మవార్లు చదువుల తల్లి సరస్వతీదేవి అమ్మవారిగా దర్శనమిచ్చారు. పట్టణ విశ్వ బ్రాహ్మణ, స్వర్ణకార సంఘాల ఆధ్వర్యంలో కామాక్షీ ఏకాంబరేశ్వరీదేవి ఆలయం, నారాయణపేట, కల్వకొలను వీధి, కొంకాపల్లి, సూర్యనగర్, సూర్యనారాయణపేట తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. హౌసింగ్ బోర్డు కాలనీలోని దుర్గమ్మ ఆలయం వద్ద సామూహిక సరస్వతీ పూజలు జరిగాయి. స్పెషల్ డీసీటీఓ ఇళ్ల భక్త వత్సలం, శ్రీదేవి దంపతులు, శిరంగు కుమార్, సూర్య పద్మావతి దంపతులచే అమ్మవారికి విశేష అలంకరణ, సరస్వతీదేవి పూజలు జరిగాయి.

అమలాపురం రూరల్: అమలాపురం గాంధీ నగర్‌లో దుర్గమ్మ ఆలయం వద్ద చండీ హోమం, సామూహిక సరస్వతీ పూజలు జరిగాయి. కుంపట్ల గణేష్, మౌనిక దంపతులచే లక్ష కుంకుమ పూజలు, చండీ హోమం నిర్వహించారు. భట్నవిల్లిలోని విజయదుర్గమ్మ ఆలమంలో రెడ్డి నాగ మహేశ్వరరావు, శ్రీదుర్గా దంపతుల సహాయంతో విద్యార్థులకు పెన్నులు అందించారు. అమలాపురం సూర్యానగర్ కెనాల్ రోడ్డు వేపచెట్టు కనకదుర్గమ్మ ఆలయం వద్ద సరస్వతీ పూజలు జరిగాయి.

కాట్రేనికోన: చిర్రయానంలో కనకదుర్గమ్మ ఆలయంలో సర్పంచ్ ఓలేటి మంగాదేవి దంపతుల పర్యవేక్షణలో సరస్వతీ పూజలు చేయించారు. మండలంలోని వివిధ ఆలయాల్లో అమ్మవారికి పూజలు జరిగాయి. కుండలేశ్వరం కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించారు.

ముమ్మిడివరం: మండలంలో గోదశివారి పాలెం, పల్లవారిపాలెం, చినకొత్తలంక, లక్ష్మీదేవిలంక, ఠానేల్లంక, అయినాపురం, క్రాపచింతలపూడి గ్రామాల్లో అమ్మవార్లను సరస్వతీ దేవిగా అలంకరించారు.

ఉప్పలగుప్తం: మండలంలో దుర్గమ్మ ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. సన్నవిల్లిలో కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు.

ఐ.పోలవరం: కేశనకుర్రులో కామేశ్వరీ అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో చండీ హోమాన్ని ఆలయ అర్చకస్వామి పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో జరిపారు.

యానాం: యానాంలో శారదాదేవి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. పడవలరేవు వీధి లలితాదేవి ఆలయంలో అమ్మవారు సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. రేడియో అండ్ టీవీ ఆర్టిస్ట్ నేమాని నాగలక్ష్మీభాగవతారిణి హరికథ అలరించింది. కనకాలపేట గ్రామంలోని దుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రులను పురస్కరించుకుని అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. హంసాని రామలక్ష్మణుడు, ఉత్తరశ్రీనివాస శ్రీలతాకుమారి దంపతులచే పూజలు నిర్వహించి, విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను బహూకరించారు.

పూర్ణ పుష్కలాంబను దర్శించుకున్న ఎస్పీ

అమలాపురం టౌన్: స్థానిక ఎన్టీఆర్ మార్గ్‌లో వేంచేసి ఉన్న పూర్ణ పుష్కలాంబ సమేత అయ్యప్పస్వామి ఆలయంలో జరుగుతున్న దేవీ నవరాత్ర ఉత్సవాల్లో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పూర్ణ పుష్కలాంబను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఎస్పీతోపాటు బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ ఉన్నారు. ఆలయ ధర్మకర్తలు గోకరకొండ గంగన్న స్వామినాయుడు, మార్నెళ్ల చినబాబు, వీరా తాతాజీ తదితరులు ఎస్పీ కృష్ణారావుకు స్వాగతం పలికారు. సరస్వతీదేవిగా అమ్మవారిని అలంకరించడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



అమలాపురంలోని పూర్ణ పుష్కలాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు



చినకొత్తలంకలో పూజలు చేస్తున్న విద్యార్థులు



అమలాపురం గాంధీనగర్‌లో సామూహిక సరస్వతీ పూజలు



కనకాలపేటలో సామూహిక సరస్వతీదేవి పూజల్లో విద్యార్థులు